క్లుప్తంగా

జాతర హుండీల ఆదాయం రూ.8.76లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పలమనేరు: జాతర సందర్భంగా భక్తులు వేసిన కానుకలను స్థానిక గంగమ్మ ఆలయంలో శనివారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. ఈ ఏడాది రూ.8,76, 230 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ కమలాకర్ తెలిపారు, గత ఏడాదికంటే రూ.38వేలు అదనంగా వచ్చినట్లు తెలిపారు. ఆలయ తాత్కాలిక కమిటీ, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

వీల్ చైర్స్ వితరణ



వీల్ చైర్స్‌ను అందజేస్తున్న సంస్థ సభ్యులు

వి.కోట: పేదలకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని సత్యసాయి సేవా సంస్థ సభ్యులు అన్నారు. శనివారం పట్టణంలోని సత్య సాయినగర్ వాసులు ఇద్దరు దివ్యాంగులకు రెండు వీల్ చైర్స్‌ను వితరణగా ఇచ్చారు. అనంతరం స్వామి వారి భజన కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, సభ్యులు దేవరాజులు, ఆర్ముగం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి లిఖిత



మాట్లాడుతున్న జడ్జి లిఖిత

పలమనేరు: పరిశ్రమలో పనిచేసే కార్మికులు వారికి చట్టబద్ధంగా లభించే లబ్ధి, కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత తెలిపారు. ఆమేరకు మండలంలోని సముద్రపల్లి పరాగ్ పాల డెయిరీ కార్మికులతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఇక్కడ పని చేస్తున్న కార్మికులకు బీమా, ఈఎస్ఐ, పీఎఫ్‌లను నిర్వాహకులు చేపట్టాలని ఆమె సూచించారు. కార్మికులకు ఏదేనీ అన్యాయం జరిగితే న్యాయస్థానాల ద్వారా న్యాయం పొందే వెసులుబాటు ఉంటుందని సూచించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, డెయిరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



మొక్క నాటుతున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ బాలాజి అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోగిలేరు సచివాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మూడవ శనివారం పారిశుధ్య కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రత వంటి పనులు నిర్వహించాలని సచివాలయ అధికారులు, ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. సర్పంచ్ రమేష్‌బాబు, పంచాయతీల విస్తరణ అధికారి శారదాదేవి, పీఎస్ సుజాత పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పుంగనూరు: భావితరాల భవిష్యత్తు కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా పట్టణంలో మెప్మా సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మొక్కల నాటడం వల్ల అనేక రూపాల్లో మానవుని అవసరాలకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలి



ఎంఈఓకు వినతి పత్రాన్ని ఇస్తున్న నేతలు

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైంస్కేల్ టీచర్లకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని మాజీ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సోమచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆమేరకు స్థానిక ఎంఈఓ బాలసుందరంను శనివారం కలిసి ఇటీవల మృతిచెందిన రోషన్ అలీఖాన్ కుటుంబీకులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఓ వినతిపత్రాన్ని అందజేశారు. పలువురు టైంస్కేల్ టీచర్లు పాల్గొన్నారు.

అమానుషం

- నేలకొరుగుతున్న వృక్షాలు
- రోజూ 4 నుంచి 5 లారీల్లో తరలింపు
- వాల్టా చట్టానికి తూట్లు
- మామూళ్ల మత్తులో అధికారులు



దుర్గసముద్రం వద్ద చింతకలప లోడుతో టెంపో



కాగతిలో నరికేసిన భారీ చింత చెట్టు

చౌడేపల్లె : ఏళ్లనాటి భారీ చింతచెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. చింతచెట్ల కలపను లారీలు, టెంపోల్లో ఏకంగా తమిళనాడుకు తరలించేస్తున్నా, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత మూడు నెలలుగా చౌడేపల్లె మండలంలో చింతకట్టె కలప వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. చారాల, దుర్గసముద్రం, కాగతి, కాటిపేరి, దిగువపల్లె పంచాయతీల్లో 500 చింతచెట్లకు పైగా నరికివేతకు గురయ్యాయి. ఈ కలపను తమిళనాడు రాష్ట్రంలోని పాలకోవా, రీబెల్ట్ టైర్ల తయారీ ఫ్యాక్టరీ వారు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ నుంచి ఫలసాయం పొందే రైతుల అవసరాలను గుర్తించి, ప్రభుత్వ స్థలాల్లోని చింతచెట్లను ఒక్కొక్క చెట్టు రూ.10వేల నుంచి రూ.15 వేల రూపాయలకు కొనుగోలుచేస్తారు. ఒక్కొక్క చెట్టు నుంచి వ్యాపారస్తులకు కూలీల ఖర్చు, లారీ బాడుగపోను రూ.5వేల నుంచి రూ.8 వేల వరకు గిట్టుబాటు అవుతుండడంతో వ్యాపారస్తులు చింతచెట్ల కలపపై దృష్టి సారించారు. మండలంలోని కొందరు దళారులు తమిళనాడు వ్యాపారస్తులతో జతకట్టి పచ్చదనాన్ని హరించేస్తున్నారు. సామాన్యులెవరైనా చెట్లు కొడితే రెవెన్యూ అధికారులు వెళ్లి భయభ్రాంతులకు గురిచేస్తారు. అలాంటిది వ్యాపారస్తులు భారీ వృక్షాలను నరికేసి తరలించేస్తున్నా ఎందుకు ప్రశ్నించడంలేదు. వారిపై చర్యలు తీసుకోవడంలేదని అని నిలదీస్తున్నారు. చెట్లు, పర్యావరణం పరిరక్షణకు ఓల్టా చట్టం తీసుకొచ్చారు. చౌడేపల్లెలో ఈ చట్టం వర్తించదా అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఇకనైనా స్పందించి పర్యావరణం పరిరక్షణకు చర్యలు తీసుకుని అక్రమ చెట్ల నరికివేతను నియంత్రించాలని కోరుతున్నారు.

ముడుపులిచ్చి నోర్లు మూపిస్తున్నారు..

అక్రమ కలప వ్యాపారానికి రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖ వారికి ముడుపులిచ్చి నోర్లు మూపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పట్టపగలే భారీ వృక్షాలను నేలకొరిగిస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు పంపి అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటీస్ బోర్డు

● నేడు లయన్స్ క్లబ్ తిరంగ ర్యాలీ

పుంగనూరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

● నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

రొంపిచెర్ల: నేటి నుంచి రొంపిచెర్లలో ముత్యాలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి గుణశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు అమ్మవారి కలశం ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఊరేగింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 25వ తేదీ తెల్లవారుజామున 2గంటలకు 101 బిందెల పసుపు నీళ్లు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి మహాభిషేకం, సాయంత్రం అమ్మవారి పుష్పపల్లకీ సేవ జరుగుతుందని తెలిపారు.

కోలాహలం.. రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో జరుగుతున్న మహాభారత మహోత్సవాల్లో భాగంగా శనివారం ద్రౌపదీ ధర్మరాజుల రథోత్సవం కోలాహలంగా నిర్వహించారు. రథంపై ద్రౌపదీ అమ్మవారి విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి కొలువు తీసి పెట్టారు. రథంపై అమ్మవారికి ఇరువైపుల అర్జునుడు, ఉత్తర కుమారుడు వేషధారులు ఉన్నారు. రథాన్ని మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గుడిసత్రం వద్దకు అర్జునుడు, ఉత్తర కుమారుని వేషధారులు రథంపై అక్కడికి చేరుకున్నారు. గుడిసత్రం వద్ద చుట్టు పక్కల గ్రామస్తులు పశువులను తీసుకొచ్చారు. పశువులకు జమ్మిచెట్టు వద్ద వేషధారులు, పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అరణ్యపర్వంలో ఆవులు తిప్పుట కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని వేషధారులు పశువుల చుట్టూ తిరిగి పరుగులు తీశారు. రథోత్సవాన్ని, అర్జునుడు ఆవుల తిప్పుట కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. నేడు ఆలయం ఆవరణలో ఇలావంతుని బలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా పుష్పపల్లకి ఊరేగింపు



విద్యుద్దీపాలతో పుష్పపల్లకి

బైరెడ్డిపల్లె: పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వైభవంగా పుష్పపల్లకి ఊరేగింపు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో ప్రత్యేక వాహనంపై అలంకరించిన పుష్పపల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. బేలుపల్లె గ్రామం నుంచి పట్నపల్లె ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

జాగ్రత్తలతో రక్తపోటు నియంత్రణ



పత్తికొండలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లికార్జునరెడ్డి



గంగవరం పీహెచ్‌సీలో డాక్టర్ లహరి

గంగవరం: జాగ్రత్తలు పాటిస్తే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిదాపులకు రాకుండా నియంత్రించుకోవచ్చని వైద్యాధికారులు మల్లికార్జున్‌రెడ్డి, లహరి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని పత్తికండ, గంగవరం పీహెచ్‌సీల్లో రక్తపోటు ప్రాముఖ్యత గురించి వివరిస్తూ వ్యాధి నియంత్రణపై ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు మార్చుకుని తరచూ వ్యాయామాలు వంటివి చేస్తే బీపీ అదుపులో ఉంచుకోవచ్చన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవలను బోర్డులో ప్రదర్శించండి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలు బోర్డు రూపంలో ప్రదర్శించి సచివాలయంలో ఉంచాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ నగర్ గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామాల్లో తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పేదవానికి రైస్ కార్డులను మంజూరు చేయాలన్నారు. ఎంపీడీఓ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

యంత్రాలతో ఉపాధి పనులా!

- కూలీలు చేసినట్లు రికార్డులు
- మానిటరింగ్ సమావేశంలో సభ్యుల నిలదీత



మాట్లాడుతున్న తహసీల్దార్

చౌడేపల్లె: ఉపాధి హామీ పథకంలో యంత్రాలతో పనులు చేయించి కూలీలు పనిచేసినట్లు రికార్డులు సిద్ధం చేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అధికారులను నిలదీశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మొక్కుబడిగా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీ కూలీలకు పనులు కల్పించక పోగా వారి జాబ్ కార్డులు తీసుకుని కొందరు సిబ్బంది సహకారంతో వారి పేరిట బిల్లులు పెట్టుకొని ఆర్జిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల శ్మశాన వాటికలను దర్జాగా ఆక్రమిస్తున్నప్పటికీ అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదని మండిపడ్డారు. గతంలో ఎస్సీల సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేసినా వాటిని పరిష్కరించకుండా మళ్లీ సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. దళితుల భూములు ఆక్రమణకు గురైయ్యాయని, రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను సభ్యులు కోరారు. తహసీల్దార్ హనుమంతునాయక్ మాట్లాడుతూ సమావేశంలో వచ్చిన సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీఓ లీలామాధవి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కాలనీల్లో ఉపాధి పనులపై ప్రతి శుక్రవారం సమావేశం నిర్వహించి లబ్ధిపొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామమూర్తి, ఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయంలో అఖండ హరి నామస్మరణం



భజన చేస్తున్న బృందం

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైభవంగా హరినామస్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామి వారి నామస్మరణతో మారుమోగింది. ప్రతి శనివారం ప్రత్యేక భజన బృందం వారిచే నిర్వహించే ఈ కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని అర్చకులు తెలిపారు.

క్షయ వ్యాధిపై సర్వే చేయాలి



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్

రొంపిచెర్ల: క్షయ వ్యాధిపై ప్రత్యేక సర్వే చేయాలని జిల్లా క్షయ, లెప్రసీ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం క్షయ వ్యాధిపై 100 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలు, ఖైదీల వద్ద సర్వే చేయాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు వినయ్, దినేష్‌కుమార్ నాయక్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గాడితప్పుతున్న పోలీస్ సిబ్బంది

- ఇతర వ్యవహారాల్లో బిజీబిజీ
- తాజాగా ఇద్దరు కానిస్టేబుళ్లు వీఆర్‌కు
- పలమనేరు, గంగవరం పీఎస్‌లపై ఎస్పీ స్పెషల్ ఫోకస్

పలమనేరు: శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీస్ సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తూ ఇతర వ్యవహారాల్లో బిజీగా ఉండడం, పోలీస్‌స్టేషన్‌లోనే గొడవలు పడడం వంటి కారణాలతో పలమనేరు పోలీస్‌స్టేషన్‌లోని ఇరువురు కానిస్టేబుళ్లను క్రమశిక్షణ చర్యలో భాగంగా తాజాగా వీఆర్‌కు పంపినట్టు సమాచారం. ఇదే స్టేషన్‌లోని మరో ఇద్దరు సిబ్బంది సైతం గతంలో ఇతర కార్యక్రమాల్లో జోక్యం ఉందనే రిపోర్ట్ కారణంగా వీఆర్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. దీన్నిబట్టి చూస్తే స్టేషన్లలోని ఎస్ఐలు, సీఐల మాటను వీరు బేఖాతర్ చేస్తున్నట్టు జరుగుతున్న విషయాలను చూస్తే అర్థమవుతోంది. అందుకే ఈ రెండు పీఎస్‌లపై జిల్లా ఎస్పీ మణికంత చందోలు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు నిఘా వర్గాల ద్వారా తెలిసింది.

తాజాగా ఏం జరిగిందంటే...

ఓ కేసు విచారణలో భాగంగా ఓ కానిస్టేబుల్ నిందితునితో మాట్లాడి వివరాలు సేకరిస్తుండగా మరో మహిళా కానిస్టేబుల్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తోంది. ఈ సందర్భంగా ఇరువురు సిబ్బంది మధ్య మాటా మాటా పెరిగి ఒకరినొకరు స్టేషన్‌లో దూషించుకున్నట్టు తెలిసింది. దీనిపై నిఘా అధికారులు ఎస్పీకి నివేదిక పంపడంతో ఇటీవల ఓ మహిళా కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపినట్టు తెలిసింది. గతంలో ఇదే కానిస్టేబుల్ తన భార్య ద్వారా ఓ ఫైనాన్స్ కంపెనీలో వ్యవహారాలు సాగిస్తున్నట్టు అధికారులు తెలుసుకున్నట్టు సమాచారం.

గతంలో మరో కానిస్టేబుల్ పెద్ద డీల్..

గతంలో ఇదే స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన ఓ వ్యక్తి గ్యాంబ్లింగ్ ముఠా నాయకునితో చేతులు కలిపి కొలమాసనపల్లి అడవుల్లో పేకాట ఆడించేందుకు అండగా నిలిచినట్టు తెలిసింది. దీంతో ఆ కానిస్టేబుల్ స్థానిక పోలీస్ ఉన్నతాధికారుల వద్ద కెళ్లి నెల మామూళ్లగా మీరు చెప్పినంత జూదగాళ్ల నుంచి వసూలు చేసిస్తానని చెప్పినట్టు తెలిసింది. దీంతో అతనిపై నిప్పులు చెరిగిన ఉన్నతాధికారులు వెంటనే రిపోర్ట్ పెట్టి అతన్ని వెంటనే వీఆర్‌కు పంపినట్టు సమాచారం.



పలమనేరు పోలీస్‌స్టేషన్

సిబ్బందిపై ఎస్పీ స్పెషల్ ఫోకస్...

పలమనేరు, గంగవరం పీఎస్‌లలోని కానిస్టేబుళ్ల వ్యవహారాలపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టిని పెట్టినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఓ ఎస్బీ సీఐ ఇక్కడి సిబ్బంది వ్యవహారాలపై డేగకన్ను పెట్టినట్టు పోలీసుల్లో వినిపిస్తోంది. పట్టణంలోని ఇరువురు కానిస్టేబుళ్లు, గంగవరంలో ఇద్దరు, బైరెడ్డిపల్లిలో ఒకరిపై ఎస్పీ అధికారులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టినట్టు ఆ శాఖలోనే మాటలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఇక్కడి ఉన్నతాధికారులు ఆయా స్టేషన్లలోని సిబ్బందిపై దృష్టిని సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం



మొక్కలను నాటుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: జీవన వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక దండపల్లి రోడ్డులో మొక్కలను నాటారు. స్థానిక బాపూజీ పార్కులో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. స్థానిక సీతారామయ్య అనే దాత మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి నీళ్ల బాటిళ్లు, గొడుగులను పంపిణీ చేశారు. స్థానిక అర్బన్ వైద్యాధికారులు హెల్త్ క్యాంపును నిర్వహించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బైరెడ్డిపల్లె: ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు పూర్తిగా తగ్గించాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తీర్థంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఆరోగ్యసిబ్బంది శిరీష, జగదీష్, కిశోర్, చంద్రకళ, రాజారెడ్డి పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల సర్వసభ్య సమావేశం శనివారం జరగాల్సి ఉండగా, కోరం లేక వాయిదా వేశామని ఎంపీడీఓ రాజశేఖరబాబు తెలిపారు. తిరిగి సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారో తెలియజేస్తామని పేర్కొన్నారు

కుప్పం డిపోకు 15 కొత్త బస్సులు

కుప్పం: స్థానిక ఆర్టీసీ డిపోలో కొత్తగా 15 కొత్త బస్సులను ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. శనివారం డిపో ప్రాంగణంలో 15 కొత్త బస్సులకు పూజలు చేసి ప్రారంభించారు. రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం పాల్గొన్నారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం

పలమనేరు: నియోజకవర్గంలో గత ఐదు రోజులుగా కేవలం రాత్రి పూటే కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు వంకలు, వాగులు పారుతున్నాయి. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో మండలంలోని గొల్లపల్లి వాగు, మాడి చెరువు కింద నుంచి వచ్చే వాగులతోపాటు మరికొన్ని చోట్ల వరదనీటి ప్రవాహం ఊపందుకుంది.

పంటలకు తప్పని నష్టం

భారీగా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలోని వరి, రాగి పంటలు నేలవాలాయి. ఇక తీగపంటలైన బీర, కాకర, బీన్సు పంటలు నేలకొరిగాయి. ఇక అరటి తోటలకు నష్టం తప్పలేదు. ముఖ్యంగా పెను గాలుల కారణంగా మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. ఇప్పటికే కోతలకు సిద్ధమైన టమాట, కూరగాయల పంటల్లో భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో పంటలకు నష్టం తప్పదని బాధిత రైతులు చెబుతున్నారు.



ముసలిమడుగు వద్ద నేలవాలిన వరి



ఏటిగడ్డ వద్ద మామిడితోటలో నిలిచిన నీరు

భారీగా పిడుగులు, ఉరుములు

ఇలా ఉండగా రోజూ సాయంత్రం నుంచి అర్ధరాత్రి దాకా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతూ పిడుగులు పడుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రుల్లో హైవేలపై ప్రయాణం చేసే వాహనాలు సైతం పక్కన పెట్టి వర్షం నిలిచాక వెళుతున్నారు. ఇక భారీ గాలుల కారణంగా వాహనాలు సైతం నడపలేక రోడ్లు ఖాళీగా మారుతున్నాయి. ఏదేమైనా వర్షం కారణంగా పంటలకు నష్టం తప్పడంలేదు. అయితే వేరుశనగ రైతులకు దుక్కులు దున్నడానికి అదునుగా మారింది.